హైదరాబాద్ వార్త



- బేగంపేటకు చేరుకున్న ప్రధాని మోదీ
- షెడ్యూల్ కంటే ముందే రాక
- విమానాశ్రయంలో స్వాగతం పలికిన గవర్నర్, మంత్రి తలసాని, బిజెపి నేతలు
- మోదీ రాకతో బిజెపి శ్రేణుల్లో ఉత్సాహం
- మోదీ మోదీ నినాదాలతో మార్మోగిన సభ

## బిజెపి శ్రేణుల్లో

# నూతనోత్సాహం

మారుమోగిన మోదీ.. మోదీ నినాదం





ప్రజలకు ప్రధాని మోదీ అభివాదం

హైదరాబాద్, బేగంపేట, నవంబరు 12 ప్రభాతవార్త : నగరానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాకతో బిజెపి శ్రేణు ల్లో కొత్త ఉత్సాహం కనిపించింది. బేగంపేటలో నిర్వహించిన సభలో మోడీ ప్రసంగం పార్టీ కార్యకర్తలకు మరింత ఊపునిచ్చింది. మోడీ ప్రసంగిస్తున్న సమయంలో కార్యకర్తలు మోడీ.. మోడీ అనే నినాదాలతో సభను మారుమోగించారు. కార్యకర్తల ఉత్సాహాన్ని చూసి మోడీ మురిసిపోయారు. ఈ సందర్భంగా 'హైదారబాద్ నాకు ఇచ్చిన ప్రేమను వడ్డీతో సహా తిరిగి ఇచ్చేస్తా' అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని కేసులు పెడుతున్నా బిజెపి కార్యకర్తలు భయపడడం లేదని చెప్పిన సమయంలోనూ కార్యకర్తలు మరింత ఉత్సాహంతో నినాదాలు చేశారు. బిజెపి బలపడేందుకు అవకాశం ఉందని అన్నారు. తనను, బిజెపిని తిట్టినా భరిస్తాను గానీ.. తెలంగాణ ప్రజలకు కష్టం వచ్చే మాత్రం సహించనని చెప్పడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. మునుగోడు ఉప ఎన్నికల్లో ఓడిపోయినా పోరాడి గెలిచామనే సందేశాన్ని బేగంపేటలో నిర్వహించిన సభ ద్వారా మోడీ పార్టీ శ్రేణులకు ఇచ్చారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఓడిపోయినంత మాత్రాన ఢీలా పడిపోవద్దని, రెట్టింపు ఉత్సాహంతో మరింత ముందుకు వెళ్లాలనే సందేశాన్ని బిజెపి శ్రేణులకు ఇచ్చారని అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా ప్రధాన రాకతో బిజెపి శ్రేణుల్లో ఉత్సాహం మరింత రెట్టింపు అయ్యిందంటున్నారు.

ప్రధాన మంత్రి నరేంద్రమోదీ శనివారం మధ్యాహ్నం 1.09 నిమిషాలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. షెడ్యూల్ కంటే 30నిమిషాలు ముందుగా ఆయన ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు. మధ్యాహ్నం 1గంట 30 నిమిషాలకు బేగంపేట రావాల్సి ఉండగా ముందుగానే ఆయన బేగంపేట వచ్చారు. ప్రధానికి బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ స్వాగతం పలుకగా, రాష్ట్ర ప్రభుత్వం తరుపున మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్వాగతం పలికారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాజ్య సభ సభ్యులు డా.కె.లక్ష్మణ్,ఎమ్మెల్యే రఘునందన్,బాజపా నేతలు కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి,పొంగులేటి సుధాకర్‌రెడ్డి,డీ.కే.అరుణ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాని బేగంపేట ఎయిర్‌పోర్ట్ బయట ఏర్పాటు చేసిన సభ వేదికపైకి చేరుకుని భాజపా శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు.

### ప్రధాని మోదీ సభ వద్ద సైడ్‌లైట్స్

**బేగంపేట..** బేగంపేట విమానాశ్రయంలో నిర్వహించిన ప్రధాని మోదీ సభకు జంట నగరాల నుంచి బిజెపి శ్రేణులు బస్సులలో తరలివచ్చారు. బస్సులలో వచ్చిన కార్యకర్తలను, నాయకులను నేరుగా విమానాశ్రయంలోకి అనుమతించలేదు. విమానాశ్రయం ప్రధానద్వారం నుంచి ఎవరినీలోపలికి అనుమతించకుండా పోలీసులు పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేసారు. వాతావరణ కేంద్రానికి వెళ్లే మార్గం నుంచి బిజెపి, మీడియా వారిని లోపలికి అనుమతించారు. బిజెపి పార్టీ జెండాలతో సభా ప్రాంగణానికి వెళుతున్న కార్య కర్తల నుంచి పోలీసులు జెండాలను లాక్కుని ఒకచోట కుప్పగా పడవేశారు. సభా ప్రాంగణం వద్దకు వెళుతున్న వారి వద్ద ఉన్న వాటర్ బాటిల్స్‌తో పాటు మీడియా వారి వద్ద నుంచి కూడా పోలీసులు పెన్నులు తీసుకుని లోనికి అనుమతించారు.

- కార్యకర్తల తాకిడితో విమానాశ్రయంలో ఒరిగిపోయిన ప్లెక్సీలు
- ప్రధాన ద్వారం నుంచి అనుమతించకుండా 3చోట్ల చెక్‌పాయింట్లు ఏర్పాటు చేసిన పోలీసులు
- తనిఖీలు నిర్వ హించిన అనంతరం లోనికి పంపిన పోలీసులు
- జైమోదీ అంటూ నినాదాలిచ్చిన భాజపా శ్రేణులు
- మహం కాళీ, సికింద్రాబాద్ జిల్లా బిజెపి ఆధ్వర్యంలో టోపీలు పంపిణీ
- పలువురు టోపీలు, మరికొందరు తల పాగాలు ధరించి ప్రధాని మోదీ సభకు వచ్చిన భాజపా కార్యకర్తలు
- జన గాంకు చెందిన గరిగె మల్లేష్ ఆధ్వర్యంలో విమానాశ్రయం ప్రాంగణంలో ఒగ్గు డోలు ప్రదర్శన ఇచ్చిన 20మంది కళాకారులు
- మోదీ సభకు బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు
- బ్యాగులన్నీ ఒక చోట కుప్పగా పోసి బ్యారికేడ్ల లో నుంచి దూరి సభకు
- పోలీసుల తీరుతో బ్యారికేడ్లు ఎక్కి లోనికి వెళ్లిన బిజెపి కార్యకర్తలు, ప్రాంగణానికి చేరుకున్న విద్యార్థినులు
- మోదీ ప్రసంగిస్తున్న సమయంలో సెల్‌ఫోన్లతో చిత్రీకరించిన మహిళలు, విద్యార్థి నులు
- మోదీ సభకు తరలి వచ్చిన ముస్లీం మైనార్టీ మహిళలు
- ప్రధాని మోదీకి దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు శ్రీరాముడితో మోదీ ఉన్నట్లు గీసిన ఒక ప్రత్యేక చిత్రాన్ని ప్రధానికి రఘునందన్ బహుకరించారు.



# బ్లాక్ మార్కెట్‌కు భారీగా పసిడి

**బిల్లులు లేకుండా కిలోలకొద్దీ తరలింపు**

**దక్షిణాది సంస్థల కోసం ఇక్కడే ఆభరణాల తయారీ**

**షాపులు, నగల తయారీ కేంద్రాలపై నిఘా కరువు**

**నిత్యం శంషాబాద్‌లో కిలోల కొద్దీ పట్టివేత**

**దృష్టి సారించని కమర్షియల్ టాక్స్ అధికారులు**

హైదరాబాద్, నవంబర్ 12, ప్రభాతవార్త: దేశంలో బంగారం వ్యాపారం రోజురోజుకూ ఎంత అభివృద్ధి చెందుతుందో బ్లాక్ మార్కెట్‌కు కూడా విపరీతంగా తరలుతోంది. దేశవ్యాప్తంగా ఉన్నటన్నుల కొద్దీ బంగారం బ్లాక్ మార్కెట్‌కు తరలుతుందనడానికి సాక్ష్యం పట్టుబడతున్న అక్రమ గోల్డ్ దందాదారులు, జ్యువెల్లరీ షాపుల్లో, ట్రాన్స్‌పోర్టుల్లో, పోలీసులు తనిఖీల్లో, కస్టమ్ అధికారులకు చిక్కుతున్న ఘటనలే. జీఎస్టీ అమలు తర్వాత బంగారంపై పెరిగిన ట్యాక్స్‌ల వల్ల అధికశాతం వ్యాపారులు దొడ్డి దారిన జరిగే వ్యాపారానికికే మొగ్గు చూపుతున్నారు. ఎప్పటికప్పుడు నిఘా పెట్టి అక్రమంగా సాగుతున్న ఈదందాకు అడ్డుకట్ట వేయాల్సిన ఆదాయ, వాణిజ్యపన్నులుశాఖ అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారు. పోలీసులు, కష్టమ్స్ అధికారులు బంగారాన్ని పట్టుకుని సంబంధిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారే తప్ప.. ఆదాయపన్నులశాఖ అధికారులు పట్టుకున్న దాఖలాలైతే కనిపించడం లేదు. ఆయాశాఖల అధికారులు కార్యాచరణలోకి దిగితే ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్న కోట్ల రూపాయలు ఖజానాలోకి చేరు అవకాశాలు ఉంటాయి. బంగారు ఆభరణాలకు డిమాండ్ ఎక్కువగా ఉండటంతో చాలా మంది పసిడిని స్థిరాస్థిగా కూడా భావిస్తారు. పెద్దపెద్ద వ్యాపారులు బంగారం నిల్వలు ఉంచి వ్యాపారం చేస్తుంటారు.జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పటినుంచి పన్నుల సమీకరణాలు మారాయి. అప్పటివరకు 1.2శాతం ఉన్నప్పటికీ.. గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ ప్రవేశపెట్టడం వల్ల దాని విలువ 3శాతానికి పెరిగింది. ముంబైలోని జవేరీ బజారైనా..హైదరాబాద్‌లోని అబిడ్స్, గుల్జార్‌హౌజ్, సికింద్రాబాద్ లాంటి ఆభరణాల మార్కెట్లైనా.. ఇప్పటివరకు చాలామంది వ్యాపారులు పన్నులు లేకుండా విక్రయించడానికి ఇష్టపడుతున్నారు. నిత్యం ఇలాంటి వ్యాపారం జోరుగా సాగుతున్నా.. ఏదైనా ఉదతం జరిగినప్పుడే ఈదందాలపై అధికారుల లెక్కల్లోనికి వస్తున్నాయి. ఆతర్వాత కొన్ని రోజుల హడావిడి చేయడం ఆతర్వాత వదిలేయడం పరిపాటిగా మారింది. తెరపైకి రాకుండా చాపకింది నీరులా సాగిపోతున్న ఈ జీరోనెంబర్ బంగారం వ్యాపారానికి నగరంలో కొదవలేదని ఐటీ అనుమానిస్తోంది. రాజధానిలో జరుగుతున్న బంగారం విక్రయాల్లో దాదాపు40శాతం రికార్డులకు దూరంగా ఉంటుందని తెలుస్తోంది. ప్రతి నెలా దాదాపు రూ.100కోట్ల వరకు ఈతరహా వ్యాపారం సాగుతోందని సమాచారం.. అయినా లక్షల రూపాయల్లోనే జరుగుతుం దంటూ చాలా మంది పన్నులు చెల్లించకుండా తప్పించు కుంటున్నారు. బంగారం వ్యాపారంలో ఒక్కబిల్లు కట్‌చేస్తే ట్యాక్స్‌ల రూపంలో భారీ మొత్తమే చెల్లించాల్సి ఉంటుంది. ఈనేపథ్యంలో అటు రిటైల్ ఇటు హోల్‌సెల్ వ్యాపారాలు కాగితాల్లోనే సాగిపోతున్నట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

**ఇలా చెయ్యాల్సిందే..** బంగారం షాపులు, నగర తయారీ కార్ఖానాలు, ఇతర వ్యాపార కేంద్రాలపై ఆదాయపన్ను శాఖాధికారులు తరచూ నిఘా పెట్టి తనిఖీలు నిర్వహించాలి. నగరంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న తయారీ కేంద్రాలకు వద్దకు వల్లి వారి వద్దఉన్న కిలోల కొద్ది బంగారాన్ని ఎక్కడినుంచి తీసుకొచ్చారు. పత్రాలు ఉన్నాయోలేవో పరిశీలించాలి. షాపుల్లో నిల్వఉన్న ఆభరణాలకు సంబంధించిన బిల్లులు ఉన్నాయో లేవోకూడా పరిశీలించాలి. ఇలాంటి కొన్నిచర్యలు తీసుకుంటే అక్రమంగా తరలుతున్న బంగారం.. కోట్ల కొద్ది రూపాయలు ప్రభుత్వ ఖజానాలో జమయ్యే అవకాశాలు ఉన్నాయి.

### మోటార్ సైకిల్‌ను ఢీకొట్టిన ఆర్టీసి బస్సు

## యువకుడు మృతి.. మరొకరికి గాయాలు



సంఘటనా స్థలం వద్ద రోదిస్తున్న మృతుని తల్లి, మునావత్ గణేష్ (ఫైల్ )

ఆటో డ్రైవర్ రమావత్ దుర్గా ప్రసాద్

సరూర్‌నగర్, నవంబర్ 12 ప్రభాతవార్త: ఆర్టీసి బస్సు ఢీకొనడంతో మోటర్ సైకిల్‌పై వెళ్తున్న ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన శనివారం బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్‌పెక్టర్ బొడ్డుపల్లి భాస్కర్ కథనం ప్రకారం కుర్మల్‌గూడ జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీకి చెందిన కూలి పనిచేసే మునావత్ గణేష్ (18) తన స్నేహితుడైన ఆటో డ్రైవర్ రమావత్ దుర్గా ప్రసాద్ (20)తో కలిసి కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయానికి పల్సర్ మోటార్ సైకిల్ (నెం. టిఎస్08ఇజె0907 పై వెళ్తుండగా బాలాపూర్ ఎస్‌పిఆర్ గార్డెన్స్ సమీపంలోని ఆర్‌సిఐ రోడ్డుపై వెనుక నుండి అతి వేగంగా వచ్చిన ఆర్‌టిసి బస్సు (నెం.ఎపి28జెడ్1903) ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్ వెనుక కూర్చున గణేష్ అక్కడికక్కడే మృతి చెందగా దుర్గా ప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు ఫిర్యాదు అందడంతో బాలాపూర్ పోలీసులు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఆరోగ్యంగానే కనిపిస్తూ కుప్పకూలుతున్నారు

**పాతికేళ్లకే గుండెకు గండం**

**ఛాతీ, కడుపు, తలనొప్పి మాటున అసలు సమస్య**

**ఎముకలు కొరికే చలి గుండెనూ పిండేస్తోంది**

**పొంచి ఉన్న ప్రమాదం అప్రమత్తత అవసరం**



హైదరాబాద్, నవంబరు 12 ప్రభాతవార్త : 'రామంతపూర్‌కు చెందిన ఉమామహేశ్వర్ ప్రైవేటు ఉద్యోగి. అయనకు భార్య, ఇద్దరు పిల్లలు, వృద్ధులైన తల్లిదండ్రులు ఉన్నారు. వీరంతా ఉమామహేశ్వర్‌పైనే ఆధారం. ఉదయమే ఆఫీసుకు వెళ్లేందుకు ఆయన ఇంట్లో నుండి బయటకు రాగానే ఛాతిలో నొప్పితో గుండె నొప్పి రావడంతో అక్కడే కుప్పకూలిపోయాడు'..'ఉప్పల్‌కు చెందిన బుర్ర వెంకటేశ్వర్లు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. పనిలో చాలా చురుకు, ఒక్కసారిగా తల నొప్పి, ఛాతిలో కాస్త నొప్పి అనిపించింది. వైద్యుడి వద్దకు వెళ్ళగా ఈసీజీలో గుండె నొప్పి లక్షణమని తేలింది. వెంటనే ఆసుపత్రిలో చేరి చికిత్స పొందడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు'.. ఇలా పాతికేళ్ళ ప్రాయం.. నిండు యవ్వనం, రాళ్లు తిన్నా అరిగిపోయే వయసు.. ఉజ్వల భవిష్యత్ ఉన్నవారు.. అలాంటివారు అకస్మాత్తుగా గుండె పోటుకు గురవుతున్నారు. నొప్పి తీవ్ర స్థాయిలో ఉంటుండటంతో ప్రాణాలు వదులుతున్నారు. కొందరు వ్యాయామం చేస్తూ అస్వస్థతకు గురై, ఆసుపత్రులలో చేరి మృతి చెందిన పలు ఉదంతాలు కనిపిస్తూనే ఉన్నాయి. అయితే ఇబ్బందిని వెంటనే గుర్తించిన కొందరు ఆసుపత్రిలో చేరి ప్రాణం నిలుపుకుంటున్నారు.

ఛాతిలో ఇబ్బందిగా అనిపిస్తే చాలామంది యువకులు సాధారణమేనని భావిస్తున్నారు. తలనొప్పి వస్తే సొంతంగా మందులు కొనుక్కొని వాడుతున్నారు. కడుపులో నొప్పి వస్తే అసిడిటీ అనుకొని ఇతర వైద్యుల వద్దకు వెళ్తున్నారు. కానీ ఛాతినొప్పిని గుండె సమస్య లక్షణాలని అంచనా వేయలేకపోతున్నారు. దీంతో చికిత్స ఆలస్యమై ప్రాణాపాయ స్థితికి దారితీస్తోందని వైద్యులు చెబుతున్నారు. గుండె నొప్పి ఏ కారణం ఏ లక్షణంతో ఉంటుందో తెలియని పరిస్థితి కూడా దీనికి కారణమని కార్డియాలజిస్టులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం కార్డియోవాస్కులర్ జబ్బులు బాగా పెరిగాయి. ముఖ్యంగా మహిళల్లో బాధితుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది.

మారిన జీవన శైలి, దూమపానం, మాదక ద్రవ్యాల వినియోగం కొంతమంది యువతలో పెరిగిపోయింది. ధూమపానం వల్ల రక్తాన్ని సరఫరా చేసే నాళాలు కుంచించుకుపోయి గుండె నొప్పికి గురవుతున్నట్లు వైద్యులు తెలిపారు. ఆహార అలవాట్ల కారణంగా చిన్న వయసులోనే గుండె జబ్బులు తలెత్తుతున్నాయి. గుండె రక్త నాళాల్లో పూడికలు (బ్లాక్స్) ఏర్పడి కరోనరీ హార్ట్ డిసీజ్‌కు దారితీస్తోంది. 25 ఏళ్ళ వయసుకే రక్త నాళాల్లో పూడికల కారణంగా గుండె శక్తి సామర్థ్యాలు తగ్గుతున్నాయి. స్టెంట్లు, యాంజియో ప్లాస్టీ చేయించుకునే వారి సంఖ్య పెరుగుతోంది. మధుమేహం, అధిక రక్తపోటు, అధిక బరువు, కొలెస్ట్రాల్ కారణంగానూ గుండె జబ్బులు పెరుగుతున్నాయి.చలి కాలంలో అనారోగ్య సమస్యలు ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉంది. ముఖ్యంగా చలి కాలంలో అప్రమత్తత అవసరమని గుండెవ్యాధి నిపుణులు సూచిస్తున్నారు. గుండె రక్త నాళాల్లో ఒక్కసారిగా విస్పోటం జరగడానికి చలికాలంలో అవకాశాలెక్కువ. చలి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు రక్తం చిక్కబడుతుంది. శ్వాస నాళాలు కుదించుకుపోయినట్లే గుండెల్లోని రక్తనాళాలు కూడా ముడుచుకుపోతాయి. రక్తపోటులో మార్పులు చోటు చేసుకుంటాయి. ఫలితంగా రక్తసరఫరా కోసం గుండె ఎక్కువగా శ్రమించాల్సి వస్తుంది.ఈ నేపథ్యంలో చలికాలంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఛాతిలో హఠాత్తుగా నొప్పి రావడమనేది అత్యంత అరుదుగా జరిగే విషయం. చాలా సందర్భాల్లో గుండె నొప్పి మెల్లగా మొదలై ముందుకు, వెనక్కు, పక్కలకు పాకుతూ ఉంటుంది. ఛాతిలో నొప్పి అని చెప్పలేం కానీ ఏదో అసౌకర్యంగా ఉంటుంది. తగ్గిపోతూ, మళ్ళీ వస్తూ ఉండడంతో నిర్లక్ష్యం చేసే ప్రమాదం ఉంది. సాధారణంగా ఛాతి మధ్యలో మొదలైన నొప్పి ఎడమ వైపు వెనక్కు వెళుతూ ఉంటుంది. అప్పుడప్పుడు కుడి వైపు, ఒక్కోసారి రెండు వైపులకీ వ్యాపిస్తూ ఉండవచ్చు. ఇంకొన్ని సందర్భాలలో ఎడమ భుజం నుంచి మణికట్టు వరకు తిరుగుతూ ఉంటుంది.ధూమపానం, పొగాకు ఉత్పత్తులు తీసుకోవడం వల్ల త్వరగా గుండె జబ్బులు వచ్చే ప్రమాదముంది. ఇతరులతో పోలిస్తే పొగ తాగేవారిలో గుండెపోటు ముప్పు 10రెట్లు ఎక్కువ. ఇంట్లో ఒకరు ధూమపానం చేస్తే అది కుటుంబసభ్యులందరికీ గుండెజబ్బు తెచ్చిపెడుతుంది. వైద్యుల వద్దకు వచ్చే గుండె జబ్బుల బాధితుల్లో 30 నుండి 40శాతం యువత ఉంటున్నారు. డ్రగ్స్ వాడేవారిలో రక్తనాళాలు కుంచించుకుపోయి రక్త ప్రసరణ సరిగా ఉండడంలేదు. కుటుంబంలో తల్లికి 65 ఏళ్ళ వయసులో తండ్రికి 55 ఏళ్ళ వయసులో గుండె నొప్పి వస్తే వారి పిల్లలకు ముప్పు త్వరగా పొంచి ఉంటుంది.



ఉప్పల్ మినీ శిల్పా రామంలో వారంతపు సాంస్కృతిక కార్య క్రమాల్లో భాగంగా రాధిక వేముల శిష్య బృందం ఆధ్వ ర్యంలో శనివారం కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు.

### అజాగ్రత్తగా నడుపుతున్న డీసిఎంకు కారు ఢీకొని

## ఒకరు మృతి, పలువురికి గాయాలు



ప్రమాదానికి గురైన కారు

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 12 ప్రభాతవార్త : హైదరాబాద్ మన్సురాబాద్‌లో నివాసముండే బొల్లు అశోక్ తన కుటుంబ సభ్యులతో కలిసి తమ ఇంటి నుండి కొమరవెల్లికి టిఎస్08 జి 6654 నెంబరు గల కారులో ఓఆర్ఆర్ పెద్దఅంబర్‌పేట్ మీదుగా వెళ్తుండగా మార్గమధ్యలో ఎగ్జిట్ నం. 10 దాటినా తరవాత, బాచారం గ్రామశివారు వెళ్ళేసరికి తమ ముందు వెళ్లుచున్న ఒక టిఎస్ 07 యుకె0939 నెంబర్ గల డిసిఎంను డ్రైవర్ అతి వేగంగా, అజాగ్రతగా నడుపుకుంటూ వీరు వెళ్తున్న లేన్‌లోకి వచ్చి, అకస్మాత్‌గా బ్రేక్ వేయడంతో కారు నడుపుతున్న పర్శ రాధారామన్ తన కారును అదుపు చేసే క్రమంలో, కారు అదుపు తప్పి డిసిఎం వెనుక ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాధారామన్ ఎడమకాలువద్ద రక్త గాయం, అతని భార్య కావ్య తలకు గాయం కాగా, బొల్లు అశోక్ తల నుదుటి భాగంలో రక్తగాయం కాగా అతని భార్య రమకు కంటి వద్ద రక్తగాయం కాగా, తన కుమారుడు వంశీ తల, భుజంపై గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ద్వారా వారిని 108 అంబులెన్స్‌లో హయత్‌నగర్ మ్యాక్స్ క్యూర్ ఆస్ప్రత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే కావ్య మృతి చెందినట్లు తెలిపారు. బొల్లు అశోక్ ఇచ్చిన పిర్యాదు మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## డిగ్రీ విద్యార్థులకు హాస్టల్ కేటాయించేంత వరకు కాంగ్రెస్ పార్టీ మద్దతు



నిజాం కళాశాల విద్యార్థుల ఉద్యమానికి సంఘీభావం తెలుపుతున్న మల్లు భట్టివిక్రమార్క, మధుయాష్కిగౌడ్, చెరుకు సుధాకర్

సైఫాబాద్, నవంబరు 12 ప్రభాతవార్త: డిగ్రీ చదువుతున్న నిజాం కళాశాల అమ్మాయిలకే హాస్టల్‌ను మొత్తాన్ని కేటాయించాలని, కేటాయించేంతవరకు వారికి మద్దతుగా నిలుస్తామని పలువురు సినీయర్ కాంగ్రెస్ నేతలు స్పష్టం చేశారు. కేవలం చిన్నపాటి హాస్టల్ విషయంలో ప్రభుత్వం అమ్మాయిల జీవితాలతో చెలగాటమాడటం సిగ్గుచేటని వారు విమర్శించారు. హాస్టల్ డిగ్రీ విద్యార్థులకే కేటాయించాలని గత ఆరు రోజులుగా నిజాం కళాశాలలో ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థులకు శనివారం కాంగ్రెస్ పార్టీ నేతలు మల్లు భట్టివిక్రమార్క, మధుయాష్కిగౌడ్, చెరుకు సుధాకర్ తదితరులు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. తాము నిజాం కళాశాలలోనే చదువుకున్నామని భట్టివిక్రమార్క, మధుయాష్కిగౌడ్ తెలిపారు. ఆరోజుల్లో ఈ కాలేజీలో కేవలం డిగ్రీ మాత్రమే ఉండేదని, ఆ తరువాత పిజిని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. తాను ప్రక్కనే ఉన్న గాంధీ మెడికల్ కళశాలలో చదువుకోవడం జరిగిందని చెరుకు సుధాకర్ తెలిపారు. తాము చదువుకుంటున్న రోజుల్లో విద్యార్థులకు ఇలాంటి ఇబ్బందులు ఏమి ఉండేవికావన్నారు. కొత్తగా నిర్మించిన హాస్టల్‌లో డిగ్రీ విద్యార్థులకు ఖచ్చితంగా కేటాయించాలని, ఈ విషయంపై వైస్-చాన్సలర్‌కు లేఖ రాస్తామని వారు భరోసా ఇచ్చారు. అమ్మాయిల పట్ల రాష్ట్ర విద్యాశాఖాధి కారి నవీన్‌మిట్టల్ కేసులు పెడతామని బెదిరించడం దారుణమని, అమ్మాయిలను బెదిరించిన నవీన్ మిట్టల్‌పైన కేసు పెట్టాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ లెక్చరర్స్ పోరం అధ్యక్షుడు కత్తి వెంకటస్వామి, పిడిఎస్‌యు సెంట్రల్ జోన్ ప్రధాన కార్యదర్శి తీగల శ్యాం కూడా విద్యార్థులకు సంఘిభావం తెలిపారు.

ఇదిలా ఉండగా విద్యార్థుల వద్దకు నిజాం కళాశాల వైస్-ప్రిన్సిపల్, హాస్టల్ వార్డెన్ వచ్చి హాస్టల్‌లో 50 శాతం మంది డిగ్రీ అమ్మాయిలకు ప్రవేశం కల్పిస్తామని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీంతో విద్యార్థులు పెద్దఎత్తున వ్యతిరేకించి 100 శాతం కేటాయించాలని, అప్పటి వరకు ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు. దీంతో వారు వెనుదిరిగి వెళ్లిపోయారు.

## ఘరీబ్ నవాజ్ మసీదు కమిటీ అవకతవకలపై విచారణ జరిపించాలి

**ఎల్లమ్మబండ 18బస్తీల ముస్లిం సభ్యులు డిమాండ్**




ఆందోళనకు దిగిన ముస్లిం సోదరులు

కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 12, ప్రభాతవార్త : గరీబ్ నవాబ్ మసీద్ కమిటీ సభ్యుల అవకతవకలపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ఎల్లమ్మబండ ఘరీబ్ నవాజ్ మసీద్‌లో తమకు హక్కు కల్పించాలని ఎల్లమ్మబండ పరిసర 18కాలనీలకు చెందిన ముస్లింలు శనివారం ఘరీబ్ నవాజ్ మసీదు ముందు ఆందోళన చేపట్టారు. గత ఆరు సంవత్సరాలుగా కొంతమంది మసీదు కమిటీ పేరుతో కొనసాగుతున్న తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, మసీదు లెక్కలు బయటపెట్టకుండా ప్రశ్నించిన వారిపై గూండాయిజం చేస్తున్నారని ఆరోపించారు. 2016 సెప్టెంబర్ 31వ తేదీన ఘరీబ్ నవాజ్ మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్‌గౌస్ కమిటీని రద్దు చేస్తున్నట్లు కాలనీ ముస్లిం పెద్దలు, సమీప కాలనీలు ఎన్‌టిఆర్ నగర్, పిజెఆర్‌నగర్, ఆల్విన్‌కాలనీ మసీదు కమిటీల పెద్దలకు తన రాజీనామ పత్రాన్ని అందించడం జరిగిందని కాలనీవారు తెలిపారు. కమిటీ రద్దు అయింది కాబట్టి కొత్త కమిటీని ఎన్నుకోవాలని కోరిన వినకుండా పాత కమిటీ సభ్యులు నాలుగు గోడల మధ్య కమిటీని ఏర్పాటు చేసుకుని ప్రకటించుకోవడం సబబు కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్లమ్మబండ పరిసర 18 బస్తీలకు చెందిన వారితో కలిసి మసీదు కమిటి ఏర్పాటు చేయమని అడిగితే ఘరీబ్ నవాజ్ మసీదు కేవలం కాజానగర్ కాలనీకి చెందింది మీరు వేరే మసీదు కట్టుకోండి అంటూ బెదిరిస్తు, దాడులకు పాల్పడుతు భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని తెలిపారు.

## సెల్‌ఫోన్ల రికవరీలో బాలానగర్ ఎస్‌ఓటీ అధికారులకు ప్రశంసలు



రికవరీ చేసిన సెల్‌ఫోన్లతో పోలీస్ అధికారులు

పేట్‌బషీరాబాద్, నవంబర్ 12 ప్రభాతవార్త: చోరీకి గురైన సెల్‌ఫోన్లను నిందితుల నుంచి రికవరీ చేసి శనివారం ఎస్‌ఓటీ బాలానగర్ పోలీస్ అధికారులు బాధితులకు అందజేశారు. వివరాల్లోకి వెళితే.. బాలానగర్ జోన్ డీసీపి సందీప్ ఆధ్వర్యంలో కొంపల్లి ఎస్ఎన్ఆర్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన సమావేశం లో ఎస్‌ఓటీ అధికారులు దొంగలించబడిన సుమారు 212 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని వారి యజమానులకు అప్పగించారు. ఈ సందర్భంగా డిసిపి సందీప్ మాట్లాడుతూ రైల్వేస్టేషన్, బస్ స్టేషన్, సినిమా థియేటర్, షాపింగ్ మాల్స్‌ల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా సెల్‌ఫోన్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపించాలని లేదంటే తమ పర్సనల్ డేటా, బ్యాంక్ లావాదేవీలు, పర్సనల్ ఇన్ఫర్‌మేషన్ దొంగలించి బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడే అవకాశముందని హెచ్చరించారు. తమ పోలీస్ అధికారులు ఇతర రాష్ట్రాలకు వెళ్ళి దొంగలించబడిన సెల్‌ఫోన్లను స్వాదీనం చేసుకొన్నారని, అదే విధంగా మరి కొన్ని ప్రాంతా లలో కొరియర్ ద్వారా సెల్‌ఫోన్లను తీసుకువచ్చి భాదితులకు అప్పగించామన్నారు. సెల్‌ఫోన్ల రికవరీలో చాకచక్యంగా విధులు నిర్వహించిన బాలానగర్ ఎస్‌ఓటీ సీఐ జేమ్స్‌బాబు, పేట్‌బషీరాబాద్ ఏసీపీ రామలింగరాజు, సీఐ ప్రశాంత్‌ను అభినందించారు. సెల్‌ఫోన్ల యజమానులు పోలీస్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపి అభినందించారు.

# లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి తిరుపతి

**ఎల్.బి.నగర్, నవంబర్ 12 ప్రభాతవార్త :** సత్వర న్యాయం జరగడానికి లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి అర్.తిరుపతి పేర్కొన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా కోర్ట్ ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోకాదాలను సద్వినియోగం చేసుకోవాలని, లోక్ అదాలత్ ద్వారా కేసు పరిష్కారమైతే చెల్లించిన కోర్ట్ ఫీస్ కూడా తిరిగి ఇస్తామన్నారు. ఈ వేదిక ద్వారా మొదటి ఫ్యామిలీ కేసును పరిష్కరించి కక్షిదారులకు చెక్ అందజేశారు. రోడ్డు ప్రమాదంకేసులో మరణించిన కుటుంబ సభ్యులకు ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా నష్టపరిహారాన్ని వారి బ్యాంకులో వేయలని లోక్ అదాలత్ అధికారులను ఆదేశించింది. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఏ.శ్రీదేవి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా న్యాయస్థానాల్లో 24 లోక్‌అదాలత్ బెంచిలు ఏర్పాటు చేశామని, రాజీకి ఆమోద యోగ్యమైన క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవాలన్నారు. లోక్ అదాలత్ నిర్వహణలో పోలీస్, ఇన్సూరెన్స్ కంపెనీలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు సహకారం అందించడం పట్ల అభినందించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కన్స్యూమర్ ఫోరం ప్రెసిడెంట్ సి.హెచ్.లతాకుమారి, అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాచకొండ జి.సుధీర్‌బాబు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.కస్తూరి బాయ్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజిరెడ్డి, రంగారెడ్డి జిల్లా అడ్వకేట్ బార్ ప్రెసిడెంట్ జి.సుధాకర్‌రెడ్డి, న్యాయమూర్తులు, న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్స్, కక్షిదారులు పాల్గొన్నారు.

## మోడీ సభకు తరలిన కాషాయ దండు


మోడీ సభకు వెళ్తున్న పవన్‌కుమార్, జంగారెడ్డి

**ఎల్.బి.నగర్, నవంబర్ 12 ప్రభాతవార్త :** ప్రధాని మోడీ కేటాయిస్తున్న నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్‌కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రంలో నూతన ప్రాజెక్టుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవానికి వస్తున్న ప్రధాని మోడీ శనివారం బేగంపేటలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటున్న కార్యక్రమానికి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో కొత్తపేట డివిజన్ బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరళి వెళ్లారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బిజెపి అధికార ప్రతినిధి ఎలిమినేట్ జంగారెడ్డి, రింకుగౌర్ పాల్గొన్నారు.

## సైన్స్ ఎగ్జిబిషన్లతో విద్యార్థుల ప్రతిభను వెలికితీయవచ్చు


సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న గోవర్ధిని, రాధాకృష్ణ

**తుర్కయాంజాల్, నవంబరు 12 ప్రభాతవార్తః** విద్యార్థులలో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి సైన్స్ ఎగ్జిబిషన్ ఎంతో ఉపయోగపడతాయని సిద్దార్థ కళాశాలల డైరెక్టర్ గాడిపర్తి గోవర్ధిని అన్నారు. శాంతినికేతన్, లక్ష్యా విద్యాసంస్థల ఛైర్మన్ గాడిపర్తి రాధాకృష్ణ అన్నారు. తుర్కయాంజాల్ మున్సిపాలిటీ తొర్రూర్ గ్రామంలోని లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఇగ్నైటెడ్ మైండ్స్ పేరుతో శనివారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యం, శాస్త్రీయ దృక్పదాన్ని చూపరులకు అర్థమయ్యేలా చేయడానికి, సైన్స్ పురోభివృద్ధి కోసం ఇలాంటి సైన్స్ ఎగ్జిబిషన్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్యా విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సోమవరపు కార్తీక్, సిద్ధార్థ, విద్యాసంస్థల డైరెక్టర్ సోమవరపు వంశీకృష్ణ, లక్ష్యా విద్యాసంస్థల డైరెక్టర్ రీష్మా, ప్రిన్సిపల్ నిధిగెరా, కోఆర్డినేటర్లు వేదవతి, రవికాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

## దశలవారీగా వార్డుల అభివృద్ధి : ఐలయ్య


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఐలయ్య తదితరులు

**తుర్కయంజాల్, నవంబర్ 12 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ ఏపీటీ కాలనీ పరిధిలోని వార్డుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని కౌన్సిలర్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోసికె ఐలయ్య, 19వ వార్డు కౌన్సిలర్ నారని కవిత శేఖర్ గౌడ్, కో ఆప్షన్ నెంబర్ కాకుమాను మరియమ్మ చెన్నయ్య కాలనీవాసులతో కలిసి సిసి రోడ్ శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఛైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రామిరెడ్డి సహాయ సహకారులతో శనివారం 10 లక్షల రూపాయలతో మునిసిపల్ నిధులు మంజూరు చేసి సిసి రోడ్డు పనులను కాలనీ వాసులతో కలిసి ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో ఎరుకల రమేష్‌గౌడ్, రాజు నాయక్, వెంకటేష్ చారి, శ్రీనాథ్,తదితరులు పాల్గొన్నారు.

## ఎందరికో మార్గదర్శకులు గంగుల: దేప


కేక్ కట్ చేస్తున్న గంగుల గోవర్ధన్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, నవంబర్ 12 ప్రభాతవార్త :** గంగుల గోవర్ధన్ రెడ్డి ఎంతోమందికి మార్గదర్శకంగా నిలుస్తారని మహేశ్వర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. సమాజానికి ఎంతోమంది న్యాయవాదులను అందించిన మహాత్మాగాంధీ న్యాయ కళాశాల ఛైర్మెన్, టీపీసీసీ ప్రధానకార్యదర్శి గంగుల గోవర్ధన్‌రెడ్డి జన్మదిన సందర్భంగా శనివారం కళాశాలలో భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో గోవర్ధన్‌రెడ్డి కేక్ కట్ చేసి, గజమాలతో ఘనంగా సత్కరించారు. వేద పండితులు సుధకర్‌శర్మతో ఆశీర్వచనం చేయించారు. కార్యక్రమంలో ఆర్కేపురం డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, నాయకులు నల్లెంకి ధనరాజ్ గౌడ్, బండి మధు, పంతంగి రాముగౌడ్, తాలటి రమేష్ నేత, జ్ఞానేశ్వర్ యాదవ్, శేఖర్‌ముదిరాజ్, గుల్షన్, కృష్ణరెడ్డి, కిరణ్, స్టైల్ మహేందర్, భాస్కర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మాలధారులకు అల్పాహార కేంద్రం ప్రారంభం

**సైదాబాద్, నవంబరు 12 ప్రభాతవార్త:** పుల్లూరి అనంతలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నవంబరు 12వ తేదీ నుంచి డిసెంబరు 21వ తేదీ వరకు మండల కాలం (41 రోజులు) రాత్రి 9గంటలనుంచి 10 గంటల వరకు అల్పాహారాన్ని అందించనున్నట్లు ఫౌండేషన్ ఛైర్మన్ పుల్లూరి ఉపేందర్ గుప్త తెలిపారు. చంపాపేట చౌరస్త సమీపంలోని జెఎస్ఆర్ స్విమ్మింగ్ పూల్‌పక్కన ఉన్న ఎస్.వి.ప్లీసంట్ అపార్ట్‌మెంట్‌లో మండల కాలం పాటు ప్రతి రోజు రాత్రి అయ్యప్ప మాలధారులకు అల్పాహారం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## డాక్టర్ పద్మావతికి మూడవ సారి జాతీయ పురస్కారం

**మలక్‌పేట, నవంబర్ 12 ప్రభాతవార్త :** డాక్టర్ పి.పద్మావతి 2022వ సంవత్సరానికి కళా సేవా రంగాల్లో రోల్ మోడల్ (సర్వ శ్రేష్ట దివ్యాంగన్) జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. మలక్‌పేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ డిసెంబర్ 3వ తేదీన ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా ఈ అవార్డును అందజేయనున్నట్టు తెలిపారు. 2009 కళారంగం లో, 2010లో స్త్రీ శక్తి పురస్కారంతో కలిపి 2 సార్లు జాతీ య పురస్కారం అవార్డులను అందుకోవడం జరిగిందని వివ రించారు.ఈ సంవత్సరం మూడవసారి అందుకోవడం ఆనం దంగా ఉందన్నారు. సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఈ పురస్కారాన్ని అందించను న్నట్లు ఆమె తెలిపారు.

## క్లీన్ అండ్ గ్రీన్ నేపథ్యంలో సత్కారం

**ఎల్.బి.నగర్, నవంబర్ 12 ప్రభాతవార్త :** చైతన్యపురి డివిజన్ హనుమాన్‌నగర్, న్యూదిల్‌సుఖ్‌నగర్ మధ్యలో ఉన్న మూసికాలువ బ్రిడ్జ్‌పై చెత్తచెదారం, దుర్గంధ వాసనతో కాలనీ వాసులకు ఇబ్బందిగా మారింది. క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమ నేపథ్యంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సూచన మేరకు అపోలో మెడికల్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మధుసూదన్ సొంతనిధులతో సిమెంట్‌వర్క్, పెయింట్స్, మొక్కల కుండీలు ఏర్పాటుచేసి సుందరంగా తీర్చిదిద్దారు. కాలనీసభ్యులు సాయి, వెంకట్, సంతోష్, రవికుమార్‌రెడ్డి, లక్ష్మణ్ శ్రద్ద తీసుకుని ఆ ప్రాంతాన్ని మరింత అందంగా తీర్చిదిద్దారు. ఈ మేరకు శుక్రవారం టిఆర్ఎస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, అపోలో మేనేజ్‌మెంట్ సభ్యులను, కాలనీ సభ్యులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట్ డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షుడు లింగాల రాహుల గౌడ్, కిషన్, పవన్‌యాదవ్, లక్ష్మణ్, సంతోష్ పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలి

**మలక్‌పేట, నవంబర్ 12 ప్రభాతవార్త :** ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలని ఎమ్మార్పీఎస్‌జాతీయాధ్యక్షుడు మేడి పాపయ్య డిమాండ్ చేసారు. ప్రధాని మోడి తెలంగాణ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో తనతోపాటు పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి మలక్‌పేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణే మా లక్ష్యమన్నారు. ఎస్సీ వర్గీకరణపట్ల మోడి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఎస్సీ వర్గీకరణ చేయకుండా రాష్ట్రంలో పర్యటిస్తున్న మోడి వ్యతిరేకిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టకపోతే డిసెంబర్ జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బట్టు దాస్‌రావు, గంట సుదర్శన్, సూర్యప్రకాష్, భరత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మోటార్ వెహికల్ చట్టం రద్దు చేయాలని ట్యాక్సీ డ్రైవర్ల నిరసన

**ఉప్పల్, అక్టోబరు 12 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ట్యాక్సీ, డ్రైవర్స్ జాయింట్ యాక్షన్ కమిటి ఆధ్వర్యంలో ఉప్పల్ చౌరస్తాలో పలువురు ట్రాక్సీ డ్రైవర్లు నిరసన ప్రదర్శన చేపట్టారు. ట్రాక్సీ డ్రైవర్స్ జెఎసి కో ఛైర్మన్ రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ట్యాక్సీ డ్రైవర్లు పాల్గొన్నారు. అనంతరం రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎంవి యాక్ట్ వల్ల ట్యాక్సీ డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రధాని మోడీ నగరానికి వస్తున్న సందర్భంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అక్రమచట్టాల కారణంగా డ్రైవర్లు అవస్థలు పడుతున్నారని, డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఇంధన ధరలు జిఎస్‌టి పరిధిలోకి తీసుకుని రావాలన్నారు. ఆప్ అధారిత కంపెనీల చట్టాలు తీసుకుని రావాలని సూచించారు. దీనిపై ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్యాక్సీ డ్రైవర్లు కె.సతీష్, నగేష్, ఎం.కొండల్‌రెడ్డి, కిరణ్, నయిమ్, సంతోష్, వినయ్, భూషణ్, శివ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానికి మహేశ్వరం నియోజక వర్గ బిజెపి నేతల స్వాగతం

**సరూర్‌నగర్, నవంబర్ 12 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర పర్యటకు విచ్చేసిన ప్రధాని నరేంద్రమోడికి మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. నాదర్‌గుల్‌లోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంనుండి అందెలతో కలిసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సామ సంజీవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం మల్లారెడ్డి, సీనియర్ నాయకుడు, మాజీఎంపిటిసి తర్రె మల్లేష్‌యాదవ్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు గడ్డం లక్ష్మారెడ్డి, దడిగ శంకర్, నిమ్మల సునీత శ్రీకాంత్‌గౌడ్‌లతో పాటు పలువురు బేగంపేట్ ఎయిర్ పోర్టులో ఏర్పాటు చేసిన స్వాగత సభకు తరలివెళ్ళి ప్రధానికి ఘన స్వాగతం పలికారు.

## రోడ్డు ఆక్రమణపై అధికారులు స్పందించాలి : కళ్లెం నవజీవన్‌రెడ్డి


రోడ్డును కొలతలను పరిశీలిస్తున్న కార్పొరేటర్

**హయత్‌నగర్, నవంబరు 12 ప్రభాతవార్తః** హయత్‌నగర్ డివిజన్ లక్ష్మీప్రియనగర్ కాలనీలో 100 ఫీట్ల రోడ్డుకు లింకు రోడ్డుగా ఉన్న 30 ఫీట్ల రోడ్డుకు ఆక్రమించి కంపౌండ్ వాల్ నిర్మాణం చేపడుతున్నారన్న కాలనీవాసుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి కాలనీలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. మూడు రోజుల క్రితమే ఆక్రమణపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. దీనిపై వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తగిన చర్యలు తీసుకోని పక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు.

**మోడి సభకు భారీగా తరలిన బీజేపీ శ్రేణులు...**

ప్రధాని మోడి తెలంగాణ పర్యటనలో భాగంగా బేగంపేటలో ఏర్పాటుచేసిన సభకు హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కమిటీ పార్టీ అధ్యక్షుడు సాదుల శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు.

## ప్రధాని నరేంద్రమోడి స్వాగత సభకు తరలిన బిజెపి నేతలు


ప్రధాని స్వాగత సభకు తరలిన శంకర్‌రెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, నవంబర్ 12 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ప్రధాని నరేంద్ర మోడి పర్యటన సందర్భంగా బేగంపేట్ ఎయిర్‌పోర్టు వద్ద రాష్ట్ర బిజెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రధాని స్వాగత సభకు మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం నుండి రాష్ట్ర బిజెపి సీనియర్ నాయకుడు, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు తరలివెళ్ళారు. శంకర్‌రెడ్డితో కలిసి నాయకులు బంద్యాల శంకర్‌రెడ్డి, రామిడి శేఖర్‌రెడ్డి, శ్రీకాంత్, మోహన్, ప్రభాకర్‌రెడ్డి, రవీందర్, లక్ష్మి తదితరులు బేగంపేటకు వెళ్ళి ప్రధానికి స్వాగతం పలికారు. అనంతరం అక్కడ జరిగిన స్వాగత సభలో వారు పాల్గొన్నారు.

## తెలంగాణకు రావలసిన నిధులు కేటాయించాలి: జహీర్‌ఖాన్

**ఎల్.బి.నగర్, నవంబర్ 12 ప్రభాతవార్త :** ప్రధానమంత్రి మోడీ తెలంగాణకు రావలసిన నిధులను వెంటనే విడుదల చేయాలని టిఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, కన్వీనర్ జహీర్‌ఖాన్ పాండుగౌడ్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించకుండా ప్రధాని తెలంగాణకు రావడానికి నిరసిస్తూ కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్ చౌరస్తాలో శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభజన హామీలను నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాకుండా ఎందుకు అడ్డుకుంటున్నారని బిజెపి నాయకులను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సచిన్, భాస్కర్, కిరణ్, జహిద్, శ్రీకాంత్, సంజీవ్, పాండురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు కుట్టు మిషన్లు అందజేత : రాగిడి లక్ష్మారెడ్డి


మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 12 ప్రభాతవార్త :** మహిళలు ఆర్థికంగా, సామాజికంగా రాణించేందుకు చేయూత అందిస్తున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం చిలుకానగర్ డివిజన్‌లో మధురా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించి పలువురికి కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చిలుకానగర్‌లో గత మూడు నెలలుగా మహిళలకు కుట్టు శిక్షణ అందజేస్తున్నామని, మధురా చారిటుబల్ ట్రస్ట్ సేవలు మరింత విస్తరిస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు బింగి రాజుగౌడ్, బింగి తారక్‌గౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి సంతోష్ వంజరి, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

## యువ జూనియర్ కళాశాలలో ఘనంగా సెల్ఫ్ గవర్నమెంట్ డే


హర్షవర్ధన్‌రెడ్డిని సత్కరిస్తున్న డైరెక్టర్ భాస్కర్ తదితరులు

**వనస్థలిపురం, నవంబర్ 12 ప్రభాతవార్త :** వనస్థలిపురంలోని యువ జూనియర్ కళాశాలలో గతేడాది ఇంటర్మీడియట్ పూర్తి చేసిన సిహెచ్. హర్షవర్ధన్‌రెడ్డి నేవీ ఎస్ఎస్ఆర్ మెరిట్ లిస్ట్‌లో అర్హత సాధించి, ఇండియన్ నేవీ విభాగంలో ఉద్యోగం సాధించినట్లు యువకళాశాల డైరెక్టర్ నందికంటి భాస్కర్ తెలిపారు. కేవలం ఇంటర్ విద్యార్హతతోనే ఉద్యోగం పొందాలనుకునే విద్యార్థులకు హర్షవర్ధన్‌రెడ్డి ఆదర్శంగా నిలిచారన్నారు. యువ మర్రోబ్రాంచినుండి సాగర్, నందు, ఎస్.హర్షవర్ధన్‌రెడ్డిలు సైతం నేవీలో ఉద్యోగార్హత సాధించారని తెలిపారు. శనివారం వనస్థలిపురంలోని యువ కళాశాలలో విద్యార్థులందరూ సెల్ఫ్ గవర్నమెంట్ డే ను జరుపుకున్నారు. అనంతరం నేవీలో ఉద్యోగం సాధించిన హర్షవర్ధన్‌రెడ్డిని సత్కరించారు.

## పునర్విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలి


మోడి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

**హయత్‌నగర్, నవంబరు 12 ప్రభాతవార్తః** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో ఇచ్చిన మాట ప్రకారం పునర్విభజన చట్టంలోని హామీలను అమలు చేయకుండా నరేంద్రమోడి తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి ఆరోపించారు. నరేంద్రమోడి తెలంగాణకు రావడాన్ని నిరసిస్తూ గోబ్యాక్ మోడి అంటూ నినాదాలు చేస్తూ సీపీఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కుంట్లూర్ చౌరస్తాలో మోడి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం, ఐఐటి, గిరిజన మైనింగ్ యూనివర్సిటీలు, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయ హోదా వంటి సమస్యలను పరిష్కరించకుండా రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రావడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, నాయకులు హరిసింగ్‌నాయక్, వేణుగోపాలచారి, దాసరి ప్రసాద్, నర్సింహ, పుల్లయ్య, అరుణ దేవమ్మ పాల్గొన్నారు.

## 714 జిఓను వెనక్కి తీసుకోవాలి : లారీ యజమానుల సంఘం


జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న లారీ యజమానులు

**వనస్థలిపురం, నవంబర్ 12 ప్రభాతవార్త :** రవాణా చట్టంలోని 714 జిఓను వెంటనే వెనక్కి తీసుకోవాలని అన్ని రకాల పెట్రోలియం ఉత్పత్తులను జిఎస్‌టిలోకి చేర్చాలని కోరుతూ ఆటోనగర్‌లోని విజయవాడ జాతీయ రహదారిపై శనివారం తెలంగాణ స్టేట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బూడిద నందారెడ్డి ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా గో బ్యాక్ మోడి అంటూ నినాదాలు చేశారు. అనంతరం నందారెడ్డి మాట్లాడుతూ జిఓ నెం 714ను వెనక్కి తీసుకోవాలని, పెంచిన ఇన్స్యూరెన్స్ ప్రీమియాన్ని తగ్గించాలని, కాలం చెల్లిన టోల్‌గేట్లను పూర్తిగా ఎత్తివేయాలన్నారు.కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కె.బాల్‌రెడ్డి, బి.రాంరెడ్డి, ఎస్.యాదగిరిగౌడ్, వై.జంగారెడ్డి, పి.శ్రీకాంత్‌రెడ్డి, ఎస్.లింగస్వామి, ఎ.రాజేష్, కె.దాను, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని సభకు తరలిన నాయకులు


ప్రధాని సభకు తరలివెళ్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, నవంబరు 12 ప్రభాతవార్త:** బేగంపేటలో జరిగిన ప్రధానమంత్రి నరేంద్రమోడి సభకు ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, మన్నె శ్రీనివాస్, వీరేంద్రబాబు, శరత్, రాజేందర్, రేణుక, రమాదేవి, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

## నిజాం కాలేజీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

**సరూర్‌నగర్, నవంబర్ 12 ప్రభాతవార్త:** నిజాం కాలేజీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ రాష్ట్ర యువజన విభాగం కో-ఆర్డినేటర్ గురజని సుమన్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన పలువురు యువజన నాయకులతో కలిసి నిజాంకాలేజీని సందర్శించి అక్కడ ధర్నా చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను, కోర్కెలను తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. లేని పక్షంలో విద్యార్థుల పక్షాన పోరాటం చేస్తామని సుమన్‌గౌడ్ స్పష్టం చేశారు.

## మోడీ పర్యటనకు వ్యతిరేకంగా నల్ల జెండాలతో సిపిఐ నిరసన

**తుర్కయంజాల్, నవంబర్ 12 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం రెండు తెలుగు రాష్ట్రాల పునర్విభజన లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేయడానికి వ్యతిరేకంగా మోడీ గో బ్యాక్ నిరసన కార్యక్రమం తుర్కయంజాల్ చౌరస్తాలో సిపిఐ మున్సిపాలిటీ కార్యదర్శి జి.క్రాంతి కుమార్ ఏఐటీయూసీ మున్సిపాలిటీ అధ్యక్షులు గువ్వల రాజు, కార్యదర్శి పల్లపు శివకుమార్, మున్సిపాలిటీ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుందరమ్మ ఆధ్వర్యంలో మోడీ తెలంగాణ రావడానికి వ్యతిరేకంగా నల్ల జెండాలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఒరుగంటి యాదయ్య మాట్లాడుతూ విభజన హామీలను పక్కనపెట్టి రెండు తెలుగు రాష్ట్రాల మధ్యన చిచ్చు పెడుతున్న బిజెపి విధానాలు మారాలన్నారు. రాష్ట్రాభివృద్ధికి సహకరించకపోగా, మతంపేరుతో చిచ్చు రేపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, దుబ్బ యాదయ్య, భాస్కర్, జనార్దన్, కోట్యా నాయక్, దీప్లా నాయక్, ఆనంద్, నరసింహ, లక్ష్మి, విజయ తదితరులు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ ఎంసిఆర్ కాలనీలో నేడు కార్తీక సమారాధన

**సరూర్‌నగర్, నవంబర్ 12 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం బడంగ్‌పేట్ ఎంసిఆర్ కాలనీలోని శ్రీ వాణి గాయత్రి బ్రాహ్మణ భవనం వద్ద కార్తీక సమారాధన కార్యక్రమం జరుగుతుందని సమితి ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రవణ్‌కుమార్ తెలిపారు. ఉదయం 8 గంటలనుండి కార్తీక సమారాధన కార్యక్రమాలు ప్రారంభమవుతాయనీ అన్న ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం బ్రాహ్మణ సంఘాల పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం లక్ష దీపోత్సవం ఉంటాయని ఆయన తెలిపారు.

## సేంద్రీయ ఎరువుల వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన విదేశీ విద్యార్థులు


ఆర్గానిక్ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన విదేశీ విద్యార్థులు

**సరూర్‌నగర్, నవంబర్ 12 ప్రభాతవార్త:** పూర్తిగా సేంద్రీయ ఎరువులతో పంటలు పండిస్తున్న గడ్డమల్లయ్యగూడెంలోని జెకెఆర్ వ్యవసాయ క్షేత్రాన్ని (ఆర్గానిక్ ఎస్టేట్‌ను) విదేశీ వ్యవసాయ యూనివర్సిటీలకు చెందిన విద్యార్థుల బృందం సందర్శించింది. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడకు చెందిన సిల్వర్ డ్రాప్స్ విద్యా సంస్థల ఛైర్మన్ తన తండ్రి స్వర్గీయ జె.కోటేశ్వర్‌రావు రాథోడ్ పేరు మీద గడ్డ మల్లయ్యగూడెంలో ఆర్గానిక్ ఎస్టేట్‌ను ఏర్పాటు చేసి అందులో పూర్తిగా సేంద్రీయ ఎరువులతో వివిధ రకాల పంటలను సాగుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో పరిశోధనల నిమిత్తం ఎడ్యుకేషన్ టూర్‌కు వచ్చిన టాంజానియా, సుడాన్, కెన్యా, ఇథియోపియా, జార్జియా, టాంజానియా, తజకిస్థాన్, మడగాస కర్‌తో పాటు పలు దేశాలకు చెందిన వ్యవసాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఆర్గానిక్ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జెకెఆర్ ఫార్మ్స్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు వారికి సేంద్రీయ ఎరువులతో సాగు చేస్తున్న కూరగాయలు, పండ్లతో పాటు పాల ఉత్పత్తుల గురించి వివరించారు.

## ఘనంగా విజయ వినాయక స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు


హోమం నిర్వహిస్తున్న చీకోటి ప్రవీణ్ కుమార్

**సైదాబాద్, నవంబరు 12 ప్రభాతవార్త:** ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్‌నగర్ కాలనీలోని శ్రీ విజయ వినాయక స్వామి దేవాలయం చతుర్దశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం రెండవ రోజు ఉదయం గురువందనం,ఆవాహిత దేవతా పూజలు, సామూహిక మహాగణపతి హోమం, లక్ష్మీగణపతి హోమం, లక్ష్మీ కుబేరహోమం, ఆవాహితదేవతా హోమాలు, మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం పల్లకి సేవను భక్తజన సందోహం మధ్య ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో దేవాలయ ధర్మాధికారి చీకోటి ప్రవీణ్ కుమార్ గుప్త హోమాలు నిర్వహించారు. దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన హోమగుండాల వద్ద స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి హోమాలు నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి వినాయకుడిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## నిరుపేద విద్యార్థికి ఐవిఎఫ్ ఆర్థిక సహాయం : ఛైర్మన్ ఉప్పల

**ఎల్.బి.నగర్, నవంబర్ 12 ప్రభాతవార్త :** నిరుపేద విద్యార్థులకు ఐవీఎఫ్ అండగా నిలిచి వారి అభ్యున్నతి కోసం కృషి చేస్తుందని రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త పేర్కొన్నారు. నిరుపేద ఆర్యవైశ్య విద్యార్థికి అండగా ఐవిఎఫ్ వుంటుందని అన్నారు. మిర్యాలగూడ పట్టణానికి చెందిన బీటెక్ విద్యార్థి భువన్‌చంద్రకు శనివారం నాగోల్‌లోని ఉప్పల నివాసంలో రూ.10వేల ఆర్థిక సహాయం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ద్వారా అనేక మంది పేద వైశ్య కుటుంబాలను ఆదుకుంటున్నానని తెలిపారు.

## ప్రధాని మోడికి ఘన స్వాగతం : భాగ్యలక్ష్మి


మోడి సభ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, నవంబర్ 12 ప్రభాతవార్త :** తెలంగాణ రైతులకు కల్పతరువు రామగుండంఫెర్టిలైజర్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ రూ. 9500 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టుల శంకుస్థాపన కార్యక్రమాలకు విచ్చేసిన ప్రధాన మోడిని బేగంపేట విమానాశ్రయం వదద్ద మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి నాయకులు, కార్యకర్తలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సంక్షేమంకోసం ప్రధాని మోడి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, గౌర దేవేందర్, రమేష్‌రెడ్డి, యాదగిరి, సురేందర్, కొప్పుల దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## శరవేగంగా వార్డు కార్యాలయం నిర్మాణం : రజితపరమేశ్వర్‌రెడ్డి


నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ రజితపరమేశ్వర్‌రెడ్డి

**ఉప్పల్, అక్టోబరు 12 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ వార్డు కార్యాలయం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని కార్పొరేటర్ మందముల్ల రజిత పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు శనివారం ఉప్పల్ పెద్ద మసీదు వద్ద రూ.60లక్షల వ్యయంతో చేపట్టిన వార్డు నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉప్పల్ పెద్దమసీదువద్ద వార్డు కార్యాలయం పనులు వేగంగా చేపట్టాలని సూచించారు. సకాలంలో పనులు పూర్తి చేసి త్వరలోనే కార్యాలయం ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిఇ నిఖిల్‌రెడ్డి, నేతలు ఈగ అంజయ్య, సోము జంగయ్య, సల్ల ప్రభాకర్‌రెడ్డి, వెంకటేష్ వీరప్ప తదితరులు పాల్గొన్నారు.